క్లుప్తంగా

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

అమలాపురం టౌన్: పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన కొండేటి మల్లయ్య రక్త హీనతతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి శస్త్ర చికిత్స చేసేందుకు రక్తం అవసరం కాగా స్థానిక వివేకానంద యోగాశ్రమం, ఆయుర్వేద ఫిజియోథెరిఫీ ఆస్పత్రి సభ్యులు, యోగా, జిమ్ విద్యార్థులైన పట్నాల సాయికుమార్, కె.కార్తీక్ భగవాన్, ఎల్.నాగసాయి తక్షణమే రక్తదానం చేసి ఆ రోగికి ప్రాణదాతలయ్యారు. రక్తదాతలను ప్రోత్సహించిన ఆశ్రమ యోగా గురువు, ఆయుర్వేద ఫిజియోథెరిపీ డాక్టర్ శ్రీనివాస్‌ను, రక్తదానం చేసిన యువకులను వైద్యులు అభినందించారు.

జమున మృతి తీరని లోటు

తాళ్లరేవు: సీనియర్ నటి జమున మృతికి ఎన్టీఆర్, ఏఎన్ఆర్ మహానటి సావిత్రి కళావేదిక గౌరవాధ్యక్షుడు ఉంగరాల వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సుమారు 200కు పైగా సినిమాలలో హీరోయిన్‌గా ఆమె నటించారన్నారు. రాజమహేంద్రవరం ఎంపీగా పనిచేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఆమె మృతి సినీ రంగానికి తీరని లోటన్నారు.

వార్షిక బడ్జెట్‌కు నిర్ణయం

యానాం: చాలా ఏళ్ల తర్వాత పూర్తి కాలానికి పుదుచ్చేరి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ప్లానింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులపై ఎల్జీ తమిళిసై సౌందరరాజన్, సీఎం రంగసామి ఆధ్వర్యంలో వివిధ శాఖల మంత్రులు, అధికారులతో సమావేశం జరిగింది. 2023–24కి రూ.11,600 కోట్లతో పూర్తి ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం నూతన బిజినెస్ పాలసీ అమలు చేస్తుండటంతో రెవెన్యూ పెరుగుతుందన్నారు. ముందస్తుగా బడ్జెట్ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపి అప్రూవల్ పొందనున్నారు. అనంతరం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. సమావేశంలో ఎంపీ వైద్యలింగం, ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ, కలెక్టర్ వల్లవన్ పాల్గొన్నారు.

పంపు హౌస్‌లో విద్యుత్ మోటార్లు ప్రారంభం



పంపు హౌస్‌లో మోటార్లను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీ హెడ్ వాటర్ వర్క్సుకు సంబంధించి స్థానిక చిల్డ్రన్ పార్కు వద్ద గల 4 ఎమ్మెల్డీ ప్లాంట్ పంపు హౌస్‌లో తాగునీటి సరఫరా సామర్థ్యం పెంచేందుకు రూ.15 లక్షలతో రెండు విద్యుత్ మోటార్లను శనివారం ఏర్పాటు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కొనుగోలు చేసిన ఈ మోటార్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, కట్టోజు సన్నయ్యదాసు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అంబాజీపేట: మండలంలోని పుల్లేటికుర్రు హైస్కూలు, శేషశయన సాయి విద్యావనం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఈ నెల 19న ఊబలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పుల్లేటికుర్రు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వర్రే జస్వంత్ నాగేశ్వర్, గంటి బాలాశ్రీ సూర్యతేజ, గుత్తుల అభిరామ్, గొర్రెల నాగేంద్ర శ్రీహరి, విద్యార్థినులు గొర్రెల పావని, దొమ్మేటి హాసిని, రాపాక మేరీలు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి అండర్ –17 షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎఎల్ వరప్రసాద్, పీడీ అందే సూర్యనారాయణ తెలిపారు. అలాగే పుల్లేటికుర్రు శేషశయన సాయి విద్యావనం పాఠశాలకు చెందిన 5 గురు విద్యార్థులు కూడా రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కేవీ శేఖర్ తెలిపారు. అండర్–17 విభాగంలో అయ్యగారి భరద్వాజ్, కె.నాగమ్మదుల వర్షిణి, వి.ప్రవీణ్, వి.పవిత్ర శ్రీజ, ఆర్.జయశ్రీలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు నేడు, రేపు బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

స్వామికి రూ.2.30 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. రథసప్తమి కావడంతో స్వామి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామి వారిని దర్శించుకున్నారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,67,229 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.63,079 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా స్వామికి రూ.2.30 లక్షల ఆదాయం వచ్చింది.

వైభవంగా రథసప్తమి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథ సప్తమి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. పండితులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వేసిన భారీ రథం ముగ్గు భక్తులను ఆకట్టుకుంది. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అల్లవరం: కొమరగిరిపట్నంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం రథోత్సవం నిర్వహించారు. పండితులు రథాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించి ఉత్సవ మూర్తిని రథంలో ప్రతిష్ఠించారు. మెట్ల వంశీయులు రథ యాత్రను ప్రారంభించారు. అనంతరం కొమరగిరిపట్నంలోని దేవి సెంటర్, దైవాలపాలెం, బెండమూర్లంక సెంటర్ వరకూ రథోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఆల్డా చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి యాళ్ల దొరబాబు, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ నామన సిద్ధాంతి, బొంతు సత్యనారాయణ, కడలి లక్ష్మణరావు, అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామాలయం నిర్వహిస్తున్న మహా సౌరయాగం వద్ద శనివారం రథసప్తమి పూజలు నిర్వహించారు. యాగ కర్త ముస్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సూర్యారాధన, సౌర అరుణ హోమం చేసి ఆదిత్య హృదయపారాయణ జరిపారు. అశ్విని నక్షత్ర జాతకులతో ముషిణి మొక్కకు ప్రత్యేక పూజలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కొమరగిరిపట్నంలో స్వామివారి రథాన్ని లాగుతున్న అల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేసిన రథం ముగ్గు

ముమ్మిడివరం: స్థానిక శివారు రాజుపాలెంలో రథ సప్తమి పర్వదినం సందర్భంగా భద్రావతీ సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవం జరిగింది. ఆలయ అర్చకులు పెద్దింటి వెంకటాచార్యులు, కృష్ణమాచార్యులు మంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. చింతకింద రామకృష్ణ, వెంకట సత్యనారాయణ, సూర్యప్రకాశరావు, వెంకటేశ్వరరావు, రాంబాబు, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్లను దర్శించుకుంటున్న భక్తులు



విలసవిల్లిలో మహాసౌర యాగ పూజలు చేస్తున్న పురోహితులు

ఘనంగా కల్యాణోత్సవం

యానాం: స్థానిక సాలికోటలో కొలువైన భద్రావతీ సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కల్యాణానికి యానాం, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్చకులు నాగాభట్ల వీరవెంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ పర్యవేక్షణలో రామకృష్ణశాస్త్రి అర్చకత్వంలో ఈ కల్యాణం ఘట్టం నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు భోజన ప్రసాదం అందించారు. తర్వాత మేళతాళాల మధ్య స్వామివారిని పురవీధులలో ఊరేగించారు. ఆదివారం స్వామివారికి గులాబీ పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు ఆదిమూలం కృష్ణ, ఒగ్గు భావనారుషి తదితరులు పాల్గొన్నారు.



భద్రావతి, భావనారుషిల కల్యాణం చేస్తున్న అర్చకులు

వచ్చే నెల 3న జాబ్ మేళా

ముమ్మిడివరం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 3న ముమ్మిడివరంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. ఇందులో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని సుమారు 850 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీడీఎం ఫార్మసీ, డిప్లమో అర్హత గల విద్యార్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఆధార్, ఐడీ ప్రూఫ్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 90148 61375, 99899 10835 ఫోన్ నంబర్లలతో సంప్రదించాలన్నారు.

రైల్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోనసీమ రైల్వే సాధన సమితి నాయకులు

ఉప్పలగుప్తం: దశాబ్దాల కలైనటువంటి కోనసీమ రైల్వే పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోనసీమ రైల్వే సాధన సమితి నాయకులు కోరారు. మండలంలోని చల్లపల్లిలో పోలిశెట్టి శివాజీ స్వగృహంలో శనివారం రైల్వే సాధన సమితి నాయకులు సమావేశం నిర్వహించారు. అధికారులు పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి సాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈఆర్ సుబ్రహ్మణ్యం, కుడుపూడి సూర్యనారాయణ, కల్వకొలను తాతాజీ, రుద్రరాజు నానిరాజు, ఉప్పుగంటి భాస్కర్‌రావు, ఇసుకపట్ల రఘుబాబు, దంగేటి దొరబాబు, బాబులు, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, అయప్పనాయుడు పాల్గొన్నారు.

ఉప్పునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఊసర భూములపై కదిలిన యంత్రాంగం
- బెండకాలువలో పూడికతీత, స్లూయిజ్ నిర్మాణాలకు ప్రతిపాదనలు

సాక్షి ఇంపాక్ట్

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు ఊసర వ్యవసాయ భూముల్లోకి ఉప్పునీరు చేరి రెండేళ్లుగా రైతులు వరినాట్లు వేయని పరిస్థితి నెలకొంది. దీనిపై ఈ నెల 23న పంట పొలాల్లోకి ఉప్పునీరు అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ, డ్రెయిన్స్ అధికారులు సంయుక్తంగా ఊసర వ్యవసాయక్షేత్రాలను శనివారం పరిశీలించారు. పంచనీటి కాలువ నుంచి ఉప్పునీరు వరి పొలాల్లోకి ఎదురెక్కి పంట పొలాలు చౌడు బారిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా వరి నాట్లు వేయడం లేదని అధికారులకు తెలిపారు. తుమ్మలపల్లి నుంచి మిలటరీ కాలనీ వరకూ విస్తరించి ఉన్న బెండకాలువ–4లో పూడిక తీసేందుకు, పంచనీటి కాలువ నుంచి ఉప్పునీరు వరి పొలాల్లోకి రాకుండా ఉండేందుకు రెండు చోట్ల అవుట్ స్లూయిజ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ సాంబశివ ప్రసాద్ తెలిపారు. బెండకాలువ పొడవునా మురుగునీటి గొట్టాలను తొలగించాలని పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చామన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు రాగానే పనులు చేపడతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, టీపీసీ మెంబర్ కుడుపూడి శ్రీను, రైతు భరోసా సలహామండలి సభ్యులు శేఖర్, డ్రెయిన్ డీఈ ఎంవీవీ కిషోర్, ఏసీ సునీతాదేవి, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



కొమరగిరిపట్నం శివారు ఊసర భూములను పరిశీలిస్తున్న అధికారులు

పంది మాంసం అమ్మకాల నిషేధం

అమలాపురం రూరల్: అమలాపురం పట్టణ పరిసరాల గ్రామాల్లో అంతుచిక్కని వైరస్‌తో పందులు మృత్యువాత పడుతున్నాయి ఈ నేపథ్యంలో అమలాపురం మార్కెట్‌లో పంది మాసం అమ్మకాలు నిషేధించినట్టు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఇప్పటికే పశు సంవర్ధక శాఖ అలధికారులు పందుల పెంపకందారులకు మందులు పంపిణీ చేశారన్నారు. అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పంది మాంసం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్షతగాత్రుడికి సపర్యలు చేసిన ఎమ్మెల్యే



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన గుర్తుతెలియని వ్యక్తికి ఎమ్మెల్యే పొన్నాడ సపర్యలు చేసి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం కొమానపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే పొన్నాడ కారు ఆపి క్షతగాత్రుడి దగ్గరకు వెళ్లారు. అతని వివరాలు తెలియకపోవడంతో స్థానికుల సహాయంతో అతనికి సపర్యలు చేశారు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి క్షతగాత్రుడిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య సేవలందించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

మార్కెటింగ్ నైపుణ్యాలపై శిక్షణ

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని షెడ్యూల్డ్ కులాల మహిళలు, పురుషులకు శ్రీకలాష్ ఎడ్యు స్కిల్స్ ఆధ్వర్యంలో సీహెచ్ చరణ్‌సింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్, జైపూర్ స్పాన్సర్‌గా ఐసీటీ టెక్నిక్స్ ఆన్ ఫార్మింగ్ అండ్ మార్కెటింగ్ నైపుణ్యాలపై శనివారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్గానిక్ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితర అంశాలపై వివరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాగ్‌తో పాటు పుస్తకాలను అందజేశారు. డైరెక్టర్ బి.శర్మ, న్యాయవాది పేర్ని ఆదినారాయణ పాల్గొన్నారు.

సమైక్య సంఘాల ప్రగతికి కృషి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శివశంకరప్రసాద్



హాజరైన డీపీఎంలు, ఏపీఎంలు, సంఘాల సభ్యులు

- డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్

ముమ్మిడివరం: వీఏఓలు బాధ్యతాయుతంగా పని చేసి సమైక్య సంఘాలు మరింత ప్రగతిని సాధించేలా కృషి చేయాలని కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శివశంకరప్రసాద్ సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో అమలాపురం క్లస్టర్ గ్రామ సంఘాల సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రగతి సాధించిన గ్రామ సంఘాల పనితీరును తెలుసుకుని అదే తరహాలో మిగిలిన సంఘాలు అభివృద్ధి సాధించేలా చూడాలన్నారు. శ్రీనిధి ద్వారా సంఘాల సభ్యుల జీవనోపాధి కోసం విడుదల చేసిన నిధులు రికవరీ ఆశాజనకంగా ఉండటం లేదని, దీనిపై క్షేత్ర స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహక, అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకు వస్తే వారిని ప్రోత్సహిస్తామన్నారు. పరిశ్రమల స్థాపన, సాంకేతిక సలహాలు, పథకం అమలులో చేపడుతున్న కార్యక్రమాలు, సూక్ష్మ పరిశ్రమల ప్రోత్సాహక కార్యక్రమం కింద అందించే సేవలను వివరించారు. రిటైర్డు ఎల్‌డీఎం ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.జగన్నాథరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ), ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకాలను వివరించారు. అనంతరం సమైక్య సంఘాల సంస్థాగత నిర్మాణంలో ముఖ్యంగా మొబైల్ బుకింగ్, గ్రేడింగ్, స్త్రీనిధి, హౌసింగ్, చేయూత, ఆర్థిక అంశాలపైన, సీఐఎఫ్, వీఆర్ఎఫ్ రికవరీ, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ప్రమోషన్ ప్రోగ్రామ్‌లపై సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌డీఏ అడిషనల్ డైరెక్టర్ జిలాని, డీపీఎంలు, ఏపీఎంలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

‘పది’లో మంచి ఉత్తీర్ణత సాధించాలి



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్ కోరారు. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన జగనన్న విద్యాభారతి టెస్ట్ స్టడీ మెటీరియల్‌ను శనివారం గాడిమొగ హైస్కూల్‌లో 28, లక్ష్మీపతిపురంలో 41, పి.మల్లవరంలో 85 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. సర్పంచులు కామాడి గోవలక్ష్మి, దున్నా సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు దున్నా రాంబాబు, వనమాడి, ఉప సర్పంచులు కొక్కిలిగడ్డ లోకేష్, పంపన రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ చింతా మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉప్పలగుప్తం: పదో తరగతి విద్యార్థులకు శనివారం స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని గోపవరం, చల్లపల్లి, ఎస్.యానం, వాసాలతిప్ప పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యాభారతి స్టడీమెటీరియల్‌ను జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అందజేశారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కుంచే బుల్లియ్య, హెచ్ఎంలు ఎల్.రాంబాబు, సత్యరాజ్, జీఎస్ఎస్ నారాయణ, పార్టీ నాయకులు పొగాకు శ్రీను, దాకారపు పండు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: జిల్లా ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన విద్యా భారతి స్టడీ మెటీరియల్స్‌ను పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. జెడ్పీటీసీ కుడిపూడి శివశంకరరావు ఆధ్వర్యంలో అయినాపురం, కొత్తలంక, గాడిలంక, ఠానేల్లంక, కొమానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వీటిని ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెయ్యల చిట్టిబాబు, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, పాఠశాలల హెచ్ఎంలు, సర్పంచులు పాల్గొన్నారు.



గోపవరం పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న జెడ్పీటీసీ సంపదరావు

కారును ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: తాళ్లరేవు బైపాస్ రహదారిలోని సుబ్బారాయుని దిమ్మ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసుల కథనం ప్రకారం.. సామర్లకోట సమీపం ఉండూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తూ, ఎదురుగా వస్తున్న కారును వేగంగా వచ్చి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రజనీకాంత్‌తో పాటు మరో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందున్నారు. ఇలా ఉండగా విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన సూరిశెట్టి కిరణ్‌కుమార్ కారులో అమలాపురం వెళుతుండగా ఈ ఘటన జరిగింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకులు

ఉత్సాహంగా క్రీడా పోటీలు



ఎన్‌వైకే క్లస్టర్ ఆటల పోటీల్లో విజేతలతో అధికారులు

యానాం: భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో యానాం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు శనివారం స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన యువతీ, యువకులు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సరెళ్ల కుమార్ తదితరులు బహుమతులు అందజేశారు.

ఇరుక్కుపోయి.. ఇక్కట్ల పాలై..

- లారీకి.. విగ్రహం దిమ్మకు మధ్య ఇరుక్కుపోయిన వ్యక్తి
- జేసీబీ సహాయంతో బయటకు తీసిన పోలీసులు

అమలాపురం రూరల్: నిత్యం రద్దీగా ఉండే అమలాపురం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో ట్యాంకర్ లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఓ వ్యక్తి గాంధీ విగ్రహం దిమ్మకు, లారీకి మధ్య ఇరుక్కుపోయాడు. వివరాల్లోకి వెళితే.. అమలాపురం చిట్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న నడిమెట్ల సత్యనారాయణమూర్తి శనివారం సాయంత్రం గడియారస్తంభం సెంటర్‌లో లారీని ఓవర్ టేక్ చేయబోయాడు. సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహం–లారీకి మధ్యలో మోటారు సైకిల్‌తో పాటు ఇరుక్కుపోయాడు. బయటకు తీసేందుకు వీలుకాకపోవడంతో అక్కడే ఉన్న పోలీసులు జేసీబీని రప్పించి లారీని పక్కకు తప్పించి సత్యనారాయణమూర్తిని బయటకు తీశారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో స్వల్పగాయలతో సత్యనారాయణమూర్తి బయటపడ్డాడు. గాయాలపాలైన క్షతగాత్రుడిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో గడియారస్తంభం సెంటర్‌లో ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. సత్యనారాయణమూర్తి ప్రాణాలను కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ట్యాంకర్ లారీకి, గాంధీ విగ్రహం దిమ్మకు మధ్య ఇరుక్కుపోయిన సత్యనారాయణమూర్తి

కొబ్బరి ఉప ఉత్పత్తులపై దృష్టి సారించాలి

అంబాజీపేట: కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీపై రైతులు దృష్టి సారించడం వల్ల ఆర్థిక పురోభివృద్ధి సాధించవచ్చని ఏపీ స్టేట్ అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి నేతల మల్లికార్జునరావు అన్నారు. గోదావరి ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ ట్రేడింగ్ అండ్ ప్రొడ్యూసర్ కంపెనీ (గిఫ్ట్) ఆధ్వర్యంలో మాచవరం పరిధిలోని పోతాయిలంక ఆర్బీకే వద్ద కొబ్బరిలో వచ్చే తెగుళ్లు, తెల్లదోమ నివారణ, అధిక దిగుబడులపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వైస్ ఎంపీపీ సుదాబత్తుల లక్ష్మీభార్గవి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, హెచ్‌వో ఎం.దిలీప్‌కుమార్, బీకేఎస్ నాయకులు ముత్యాల జమీలు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Tikkireddy Kousalya Devi, W/o. Venkateswarlu, D No 4-3-23b, Main Road, Konkapalli, Amalapuram, Amala puram Mandal, Dr BR Ambedkar Konaseema Dist applied for loan from M/s. Shriram Finance Ltd., Chennai, having branch office at Amalapuram Branch the security of the schedule mentioned property of him. If anybody has objection or attachments or any other interests over the properties should inform to the undersigned within 7 days from this day.

Dr B R Ambedkar Konaseema Dist, Amalapuram SRO, Peruru Panchayat, Konkapalli Area, Amalapuram Mandal.

Z Dry, R S No. 706/2 an extent of 435.6 sq yds = 364.16 sq mts is bounded by:
E: Remaining land of vendor in this survey number
S: Remaining land of vendor in this survey number
W: 24 feet wide joint passage
N: Kausika gattu
In between the above boundaries with all easement rights etc., therein.

DVVS MURTHY
Advocate
Date 28-01-2023 Amalapuram, 98483 44577